సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 13 । ఆగస్టు । 2023



కేజీహెచ్‌లో పనుల పరిశీలన

కేజీహెచ్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున శనివారం పరిశీలించారు. 8లో



మూసివేత సమయం మార్చాలి

విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ ఎయిర్ ఫ్లయింగ్ ఆపరేషన్స్ కోసం రన్‌వే మూసివేత సమయాన్ని మార్చాలని పలువురు కోరారు. 8లో



బీచ్‌రోడ్డు: దేశంలోని చారిత్రక ప్రాంతాలు, భవనాలను తమ కెమెరాల్లో బంధించిన 25 మంది ఫొటోగ్రాఫర్ల ఫొటో ఎగ్జిబిషన్ శనివారం హవామహల్‌లో ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను మయంకా దేవి ప్రారంభించారు.

న్యూస్‌రీల్

రుషికొండ శ్రీవారి సన్నిధిలో లడ్డూల విక్రయం



విక్రయాలను ప్రారంభిస్తున్న ఏఈవో

కొమ్మాది: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి భక్తకోటి నుంచి విశేష ఆదరణ ఉంది. శ్రీవారి భక్తులకు లడ్డూ ప్రసాదం విక్రయ విషయంలో తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో లడ్డూలను విక్రయించాలని నిర్ణయించింది. ఈ మేరకు శనివారం ఏఈవో జగన్మోహనాచార్యులు ఇక్కడ లడ్డూల విక్రయాన్ని ప్రారంభించారు. భక్తుల అభ్యర్థన మేరకు ప్రతి నెలా రెండో శనివారం ఇక్కడ శ్రీవారి లడ్డూలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. లడ్డూల విక్రయ కౌంటర్‌ను ఆలయం వద్దే ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 750 గ్రాముల బరువున్న కల్యాణం లడ్డూ రూ.200, 140 నుంచి 170 గ్రాముల బరువున్న సాధారణ లడ్డూ రూ.50 వంతున విక్రయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శివ, కిశోర్ పాల్గొన్నారు.

నేడు ఏపీఎల్ 3కే రన్

విశాఖ స్పోర్ట్స్: ఏసీఏ ఆధ్వర్యంలో ఆదివారం 3కే రన్ నిర్వహించనున్నట్లు ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథరెడ్డి తెలిపారు. ఈనెల 16 నుంచి విశాఖలో ప్రారంభం కానున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్ సందర్భంగా ఈ రన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాగర తీరంలో కాళీమాత ఆలయం నుంచి ఉదయం 6 గంటలకు ఈ పరుగు ప్రారంభం కానుందన్నారు. మన ఆంధ్ర మన ఏపీఎల్ పేరిట నిర్వహించనున్న ఈ పరుగు ప్రారంభ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమవర్మ, మేయర్ జి.హరివెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి, క్రికెటర్ కె.ఎస్.భరత్, రంజీ క్రీడాకారులు పాల్గొనున్నారు.

దువ్వాడ స్టేషన్ వార్షిక ఆదాయం రూ.32.39కోట్లు



దువ్వాడ రైల్వేస్టేషన్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ వివిధ మార్గాల ద్వారా ఆర్జించిన ఆదాయాన్ని రైల్వేశాఖ అధికారులు వెల్లడించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.32,39,76,980 ఆదాయం ఆర్జించి.. వాల్తేర్ డివిజన్‌లో 13వ స్థానంలో నిలిచిందని తెలిపారు. 2020–21లో రూ.21 కోట్ల ఆదాయం ఉండగా.. రెండేళ్లలో పది కోట్లకు పైగా ఆదాయం పెరగడంపై దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కాగా.. విశాఖ రైల్వేస్టేషన్ రూ.679 కోట్ల ఆదాయంతో టాప్‌లో ఉంది.

స్వాతంత్య్రోద్యమ ఘట్టంపై బుర్రకథ ప్రదర్శన

మురళీనగర్: సంప్రదాయ కళలను ప్రస్తుత తరానికి పరిచయం చేసి జానపద కళాకారులను ప్రోత్సహించేందుకు మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీనగర్ వాకర్స్ పార్కు ప్రాంగణంలో బుర్రకథ ప్రదర్శన నిర్వహించారు. అమర వీరుల విజయగాథ అనే స్వాతంత్య్రోద్యమ ఘట్టాన్ని శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం, మరుపాకకు చెందిన శ్రీనివాస బుర్రకథ దళం అద్భుతంగా ప్రదర్శించింది. డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ, క్లబ్ కార్యదర్శి ఎస్.పుష్పలత, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష పాల్గొన్నారు.

విశాఖ కారాగారంలో అన్నీ నదులే..!

- సెంట్రల్ జైలులో బ్లాక్‌లకు దేశంలో నదుల పేర్లు
- ఆ బ్లాక్‌ల కొన్నింటిలో ఖైదీలు.. మరికొన్నింటిలో రిమాండ్ ఖైదీలు
- వీటిలోనే ఆస్పత్రి, ఆడిటోరియం, కిచెన్, డైనింగ్, చేతి వృత్తుల్లో శిక్షణ ఇచ్చే భవనం



ఆరిలోవ: భారతదేశంలో నదుల చరిత్ర పురాతనమైనది. గొప్పది.. గంగా వంటి పవిత్ర నదుల గురించి గ్రంథాలు, పురాణాల్లో ప్రస్తావన ఉంది. దేశంలో గంగా, గోదావరి, నర్మద, సింధు, తుంగభద్ర మొదలైన నదులన్నీ మహిళల పేర్లతోనే ఉంటాయి. ఈ కారణంగానే నదిని తల్లిగా, పవిత్రంగా పూజిస్తాం. నదులు మనుషులకు చాలా దగ్గరగా ఉంటాయి. ఎన్నో గొప్ప నాగరికతలు నది ఒడ్డునే పుట్టాయి. ఇప్పుడు నదుల ప్రస్తావన ఎందుకని అంటారా? విశాఖ కేంద్ర కారాగారం లోపల దేశంలో ప్రవహిస్తున్న నదుల పేర్లే కనిపిస్తాయి. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది నోట ఆ పేర్లే వినిపిస్తాయి. ఇక్కడ బ్లాక్‌లకు నదుల పేర్లు పెట్టి.. వాటి గొప్పతనాన్ని చాటి చెప్పారు జైలు అధికారులు. సుమారు 100 ఎకరాల్లో విశాఖ కేంద్ర కారాగారాన్ని నిర్మించారు. దీని సామర్థ్యం 914 మంది. అయితే ప్రస్తుతం రిమాండ్, శిక్ష పడిన ఖైదీలు ఇక్కడ సుమారు 1,900 మంది వరకు ఉన్నారు.

సెంట్రల్ జైలులో 21 బ్లాక్‌లు ఉన్నాయి. ఆయా బ్లాక్‌లకు దేశంలో ఉండే ప్రముఖ నదుల పేర్లు పెట్టారు. గంగా, నర్మద, చిత్రావతి, ప్రాణహిత, శబరి, గోస్తని, స్వర్ణముఖి, తపతి, కావేరి, తుంగభద్ర, వంశధార, గోదావరి, కృష్ణవేణి, అన్నపూర్ణ, పెన్నా, నాగావళి తదితర పేర్లతో పిలుస్తారు. గంగా, కృష్ణవేణి బ్లాక్‌ల్లో రిమాండ్ ఖైదీలు ఉంటారు. నర్మదా బ్లాక్‌లో ఇతర రాష్ట్రాలకు చెందిన ఖైదీలను పెడతారు. చిత్రావతి బ్లాక్‌ను మావోయిస్ట్ ఖైదీల కోసం కేటాయించారు. సువర్ణముఖిలో మహిళా ఖైదీలు ఉంటారు. గోదావరి బ్లాక్‌లో శిక్ష పడిన ఖైదీలను ఉంచుతారు. దీన్ని ప్రధానమైన బ్లాక్‌గా పరిగణిస్తారు. తపతి, కావేరి, పెన్నా బ్లాక్‌లను ఖైదీల సెల్ కోసం వినియోగిస్తున్నారు. స్నేహ సరోవర్‌లో అడ్మిషన్లు, శాంతివనం, గోస్తనీ బ్లాక్‌లను ఆడిటోరియం, శబరిని సిబ్బంది కిచెన్‌కు, అన్నపూర్ణ బ్లాక్‌ను ఖైదీల కిచెన్‌కు ఉపయోగిస్తున్నారు. నాగావళి, వంశధార, తుంగభద్ర బ్లాక్‌లను ఓపెన్ ల్యాండ్‌గా విడిచి పెట్టారు. ప్రాణహితను ఖైదీల వైద్య చికిత్సలకు, జ్ఞాన సాగరంను లైబ్రరీ, ఖైదీలకు పాఠశాలగా వినియోగిస్తున్నారు. ఫ్యాక్టరీ బ్లాక్‌లో వివిధ పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఖైదీలు పనిచేస్తారు. స్కిల్ డెవలప్‌మెంట్ బ్లాక్‌లో ఖైదీలకు టైలరింగ్, ప్లంబింగ్, భవన నిర్మాణం తదితర చేతి వృత్తుల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పుతున్నారు. ఈ బ్లాక్‌ల్లో ఎక్కువ శాతం దేశంలో ప్రవహించే నదుల పేర్లతో ఉండటం విశేషం.

సెప్టెంబర్‌లో ఏయూ స్నాతకోత్సవం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం సెప్టెంబర్‌లో జరగనుంది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ఏయూ రిజిస్ట్రార్ విడుదల చేశారు. 87 నుంచి 90వ సంయుక్త స్నాతకోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యూజీ, పీజీ, పీహెచ్‌డీ డిగ్రీలను స్నాతకోత్సవంలో తీసుకునే వారు ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 2017 నుంచి 2021 సంవత్సరాల మధ్యలో కోర్సులను పూర్తిచేసిన వారు ఈ స్నాతకోత్సవంలో పట్టాలను స్వీకరిస్తారు. వివరాలు ఏయూ వెబ్‌సైట్ www.andhrauniversity.edu.in లో పొందుపరిచారు. గవర్నర్ తేదీ ఖరారు అయిన వెంటనే ఏయూ అధికారులు పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

అథ్లెట్ జ్యోతికి రూ.లక్ష ప్రోత్సాహకం

విశాఖ స్పోర్ట్స్: ఏపీ అథ్లెటిక్ వార్షిక జనరల్ బాడీ సమావేశం శనివారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగింది. అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతున్న విశాఖ అథ్లెట్ జ్యోతి ఎర్రాజీ తల్లిదండ్రులకు ఈ సందర్భంగా రూ.లక్ష ప్రోత్సాహకంగా అందించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అథ్లెట్లను తయారుచేసుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. జ్యోతి తండ్రి సెక్యూరిటీ గార్డ్‌గానే ఉంటూ.. కుమార్తె అంతర్జాతీయ అథ్లెట్‌గా మారేందుకు ప్రోత్సహించారన్నారు. సెప్టెంబర్‌లో అథ్లెటిక్స్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి పలు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. కాగా.. సెప్టెంబర్‌లో నేషనల్ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, ఇండియన్ ఓపెన్ అండర్–23 అథ్లెటిక్ చాంపియన్‌షిప్, నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ జరగనుంది. నవంబర్‌లో ఏపీ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ జరగనుండగా ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్, నేషనల్ అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లకు వేదికలు, తేదీలు ఖరారు కావాల్సి ఉంది.

ఐటీపీఐ భవనం ప్రారంభం



సదస్సులో కలెక్టర్ మల్లికార్జున, తదితరులు

మధురవాడ/కొమ్మాది: జీవీఎంసీ జోన్ – 2 కొమ్మాది ఓజోన్ వ్యాలీ లే అవుట్‌లో ఐటీపీఐ, ఏపీ రీజినల్ చాప్టర్ భవనాన్ని కలెక్టర్ మల్లికార్జున, ఐటీపీఎల్ న్యూఢిల్లీ అధ్యక్షుడు డాక్టర్.డీఎస్ మేష్రామ్, ఐటీపీఎల్ ఏపీ చాప్టర్ చైర్మన్ వి.రాముడు ప్రారంభించారు. అనంతరం బీచ్‌రోడ్‌లోని రాడిసన్ బ్లూలో జి – 20, వై – 20లో భాగంగా 'వాతావరణ మార్పులు, విపత్తుల రిస్క్ మేనేజ్‌మెంట్' అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. పర్యావరణ అనిశ్చితుల నేపథ్యంలో స్థిరమైన పద్ధతులు, సంసిద్ధత ప్రాధాన్యం తెలియజేయడానికి సెమినార్లు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున చెప్పారు. ఇటువంటి సెమినార్‌లు కీలకమైన సమస్యల పరిష్కారానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రపంచ సవాళ్లు, వివిధ రంగాలు, ముఖ్య వాటాదారుల మధ్య అవగాహన, సహకారాన్ని పెంచడానికి ఎంతో సహాయ పడతాయని పేర్కొన్నారు. ఇతర ప్రతినిధులు, వక్తలు డాక్టర్ రమేష్ శ్రీకొండ, టి.అయోన్‌కుమార్, ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ వేగంగా మారుతున్న పట్టణ పర్యావరణం, వాతావరణ మార్పుల ప్రభావం, గ్లోబల్ వార్మింగ్ తదితర అంశాలపై ప్రసంగించారు. ఏపీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అదనపు డైరెక్టర్ బి.సురేష్‌కుమార్, వీఎంఆర్‌డీఏ చీఫ్ అర్బన్ ప్లానర్ కె.సంజయ్ రత్న కుమార్, జీవీఎంసీ సీసీపీ వి.సునీత తదితరులు పాల్గొన్నారు.

5,850 మంది హెచ్‌ఎంలకు శిక్షణ పూర్తి



మాట్లాడుతున్న సమగ్రశిక్ష రాష్ట్ర పథ సంచాలకుడు శ్రీనివాసరావు

తగరపువలస: రాష్ట్ర వ్యాప్తంగా 6,500 ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల్లో విడతల వారీగా ఆరు శిక్షణ కేంద్రాల్లో ఇప్పటి వరకు 5,850 మందికి శిక్షణ పూర్తి చేసినట్టు సమగ్రశిక్ష రాష్ట్ర పథ సంచాలకుడు బి.శ్రీనివాసరావు అన్నారు. భీమిలి ఏఎంజీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఫర్ వుమెన్, కెడార్ స్కూల్‌లో నిర్వహిస్తున్న నాలుగో విడత శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఇప్పటి వరకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ అనంతరం ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విడతల వారీగా శిక్షణ ఇవ్వడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రధానోపాధ్యాయుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు సత్య కైవల్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సహకారంతో ఆరు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని సమగ్రశిక్ష అందిస్తుందన్నారు. పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్ది విద్యార్థులకు ఉత్తమ విద్య అందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకురాలు ఎం.జ్యోతికుమారి, డీఈవో ఎల్.చంద్రకళ, రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్.కల్పన, ప్రోగ్రాం మేనేజర్ సత్తారు బాబూరావు, ఎంఈవో డి.రామారావు, అసిస్టెంట్ అకడమిక్ మోనటరింగ్ అధికారి జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా వివేక్ వర్ధన్

మూడో ప్రయత్నంలో విజయం



విశాఖ లీగల్/మురళీనగర్: నగరంలోని మురళీనగర్‌కు చెందిన పాడిపి రెడ్డి వివేక్ వర్ధన్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఇటీవల హైకోర్టు ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి–2022 పరీక్షల్లో అర్హత సాధించారు. జూలై 6న హైకోర్టు ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ ఆయన్ని జూనియర్ సివిల్ జడ్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో 2019లో వివేక్ వర్ధన్ లా డిగ్రీ పూర్తి చేసి న్యాయవాద పట్టా పొందారు. ఆ తర్వాత సీనియర్ న్యాయవాది పుర్రే అప్పారావు దగ్గర ప్రాక్టీస్ ప్రారంభించారు. 2020, 2021లో హైకోర్టు నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలకు హాజరై.. విఫలమయ్యారు. మూడో ప్రయత్నంలో విజయం సాధించారు. వీరిది విజయనగరం జిల్లా జామి మండలం కొట్టం. ప్రస్తుతం మురళీనగర్‌లో నివాసం ఉంటున్నారు. వివేక్ తండ్రి పీవీఆర్ మూర్తి పోర్టు ట్రస్ట్ అథారిటీలో ఉద్యోగ విరమణ చేశారు. తల్లి అరుణకుమారి గృహిణి. సోదరుడు పి.వికాస్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. వివేక వర్ధన్‌కు పలువురు న్యాయవాదులు, న్యాయవాద సంఘ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. విధుల్లో న్యాయబద్ధంగా వ్యవహరించి తీర్పులు ఇస్తానని ఆయన చెప్పారు.

వరలక్ష్మి కుటుంబానికి పరామర్శ



అప్పన్నపాలెంలో పవన్ కల్యాణ్

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు పరిధి సుజాతనగర్‌లో ఇటీవల హత్యకు గురైన వరలక్ష్మి కుటుంబాన్ని శనివారం పవన్ కల్యాణ్ పరామర్శించారు. ఆమె ఇంటికి వెళ్లి వరలక్ష్మి భర్త గోపాలకృష్ణమూర్తి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద 98వ వార్డు జనసేన నాయకులు పంచగ్రామాల భూ సమస్యను పవన్ దృష్టికి తీసుకెళ్లారు. ఎల్‌జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజీకి సంబంధించి యువతపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ అప్పన్నపాలెం కూడలిలో పలువురు ఆయన్ని కలిశారు. ఆ పార్టీ నాయకులు నాదెండ్ల మనోహర్, పంచకర్ల రమేష్‌బాబు, తమ్మిరెడ్డి శివశంకర్, పంచకర్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సీబీసీఎన్‌సీ భూముల పరిశీలన

బీచ్‌రోడ్డు: సిరిపురంలోని సీబీసీఎన్‌సీ భూములను జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పరిశీలించారు. అనంతరం అక్కడ విలేకరులతో మాట్లాడుతూ విశాఖ ప్రజలు ఓటేస్తేనే ఎంపీగా ఎన్నికైన ఎంవీవీ ఇప్పుడు వేరే చోట వ్యాపారం చేస్తాననడం సరికాదన్నారు. అలాంటప్పుడు ఎంపీ పదవికి రాజీనామా చేసి వెళ్లిపోవాలన్నారు ఎంవీవీ కుటుంబం కిడ్నాప్ వెనుక, సీబీసీఎన్‌సీ భూములతో సంబంధం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ప్రశాంతమైన విశాఖలో గొడవలు పెడుతున్నారని ఆరోపించారు.

జనసేన కార్యకర్తల వీరంగం

పవన్ కల్యాణ్‌ను చూడడానికి వచ్చిన జనసేన కార్యకర్తలు వీరంగం సృష్టించారు. పోలీసులపై దురుసుగా ప్రవర్తించి వారి సహనాన్ని పరీక్షించారు. ఓ కార్యకర్త పోలీసులను దూషిస్తూ.. వారిపైకి దూసుకెళ్లాడు. దీంతో పోలీసులు అతన్ని మందలించారు. మరో వైపు సీబీసీఎన్‌సీ లోపలకు వెళ్లేందుకు కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆ పార్టీ కార్యకర్తలు ఎంత రెచ్చగొట్టినా పోలీసులు శాంతియుతంగా తమ విధులను నిర్వర్తించారు.

15న ఇన్‌చార్జి మంత్రి జాతీయ పతాకావిష్కరణ

మహారాణిపేట: పోలీస్ బ్యారెక్స్‌లో మంగళవారం జరిగే స్వాతంత్య్ర దినోత్సవంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. పలు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలివ్వనున్నారు. 8 ప్రభుత్వ శకటాల ప్రదర్శన ఉంటుంది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. పలు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆస్తుల పంపిణీ ఉంటుంది. 450 మంది ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేయనున్నారు.

నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఆచార్య సుధాకర్



ఏయూక్యాంపస్: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఏయూ హ్యూమన్ జెనెటిక్స్ విభాగం ఆచార్యులు జి.సుధాకర్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డికి లేఖ రాశారు. పాలక మండలిలో దీనికి సంబంధించిన అనుమతి తీసుకుని నిరభ్యంతర పత్రం జారీ చేయాలని కోరారు. దీనిపై ఆచార్య సుధాకర్‌ని సంప్రదించగా ఏయూ అధికారులు దీనికి సంబంధించిన ప్రక్రియ జరుపుతున్నారని, ఉత్తర్వులు అందిన వెంటనే పదవీ బాధ్యతలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

అవయవదానంపై అవగాహన నేడు

ఆరిలోవ: సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో అవయవదానంపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జీవన్‌దాన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, సీపీ త్రివిక్రమ్ వర్మ తదితరులు పాల్గొని.. అవయవదానం చేసిన వారి కుటుంబ సభ్యులను సత్కరిస్తారన్నారు. స్వచ్ఛంద సంస్థలు, కళాశాలల ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

విమానాశ్రయం మూసివేత సమయం మార్చాలి

దాబాగార్డెన్స్: విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ ఎయిర్ ఫ్లయింగ్ ఆపరేషన్స్ కోసం రన్‌వే మూసివేతకు సంబంధించి శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్, సీఐఐ, వీసీసీఐ, ఏపీ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ సంయుక్తంగా సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షుడు సుధీర్ ములగాడ, సీఐఐ విశాఖ చైర్మన్ డాక్టర్ పీపీ లాల్‌కృష్ణ, ఏపీ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమార్‌రాజా, ఉపాధ్యక్షుడు డీఎస్ వర్మ, వీసీసీఐ సెక్రటరీ రోలాండ్ విలియమ్స్ మాట్లాడుతూ విమానాశ్రయం మూసివేత సమయాన్ని రాత్రి 11 నుంచి ఉదయం 6.30 గంటలకు మార్చాలని నౌకదళ అధికారులను అభ్యర్థించారు. విశాఖపట్నం కార్యనిర్వాహక రాజధానిగా గుర్తించబడిందని, రాబోయే శీతాకాలం విమాన ప్రయాణానికి డిమాండ్ ఉంటుందన్నారు. పునరుద్ధరణ పనులు చేపట్టాలన్న నేవీ నిర్ణయాన్ని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ స్వాగతించారు. భద్రత చాలా ముఖ్యమని, అయితే విమానాశ్రయాన్ని రోజుకు 11 గంటలు మూసివేయాలనే నిర్ణయం నేరుగా ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతాకు వెళ్లే 12 విమానాల కార్యకలాపాలను ప్రభావితం చేస్తుందన్నారు. డిసెంబర్‌లో ముఖ్యమైన జాతీయ సెమినార్‌లు జరగనున్నాయని, ప్రపంచవ్యాప్తంగా 10 వేల మంది సర్జన్లు ఇక్కడకు వస్తారని, ఈ మూసివేత గంటలు పర్యాటకంపై ప్రభావం చూపుతుందన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో అంతర్జాతీయ కనెక్టివిటీని పక్కా ప్రణాళికతో మెరుగుపరచుకోవాలన్నారు.

ఒకరితో ప్రేమ. మరొకరితో రహస్య వివాహం

- ఇద్దరి ప్రాణాలను బలిగొన్న ట్రయాంగిల్ లవ్‌స్టోరీ
- ఉరి వేసుకుని బాలిక, రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య
- అరెస్టయిన మరో యువకుడు
- మైనర్ సూసైడ్ కేసులో వీడిన మిస్టరీ



సూర్య ప్రకాష్‌రావు (ఫైల్)

గోపాలపట్నం: ట్రయాంగిల్ లవ్‌స్టోరీ మూడు కుటుంబాల్లో విషాదం నింపింది. ఒకరిని ప్రేమించి.. మరొకరిని వివాహం చేసుకున్న బాలిక.. తను చనిపోయి.. మరొకరి ప్రాణాలను బలిగొంది. వివాహం చేసుకున్న వాడి జీవితాన్ని ప్రశ్నార్థకంగా మార్చేసింది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. కొత్తపాలెం నాగేంద్రకాలనీకి చెందిన బాలిక(16) ఇటీవల ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టగా.. పలు ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్న బాలికకు పలువురు యువకులతో పరిచయాలున్నాయి. ఆదర్శనగర్‌కు చెందిన సీపాన సూర్యప్రకాష్‌రావుతో ప్రేమ వ్యవహారం నడిపిస్తూ.. ఇందిరానగర్‌కు చెందిన లెంకా సాయికుమార్‌ను రహస్యంగా వివాహం చేసుకుంది. ఆమె సూర్యప్రకాష్‌తో చనువుగా ఉండడంతో సాయికుమార్‌కు నచ్చలేదు. అలాగే సాయికుమార్‌తో చనువుగా వ్యవహరించడం సూర్యప్రకాష్‌కు నచ్చలేదు. దీంతో వీరి ముగ్గురి మధ్య మనస్పర్థలు వచ్చాయి. బాలిక ఆత్మహత్యకు రెండు రోజుల ముందు ఆమె ఇంటికి ఇద్దరూ వేర్వేరు సమయాల్లో వచ్చారు. ఇద్దరిలో ఎవరితో ఉంటావో తేల్చుకోవాలని స్పష్టం చేశారు. దీంతో ఒత్తిడికి గురైన ఆమె.. ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి సూర్య ప్రకాష్, సాయికుమార్‌లపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. బాలికను ఒత్తిడికి గురి చేయడం వల్లే మరణించినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ విషయం తెలిసి ఆందోళన చెందిన సూర్యప్రకాష్ గోపాలపట్నం ఆర్‌ఆర్ క్యాబిన్ వద్ద శుక్రవారం రైలు కింద పడి మృతి చెందాడు. శనివారం మృతదేహాన్ని చూసిన అతని తల్లిదండ్రులు సూర్యప్రకాష్‌గా గుర్తించారు. లంకా సాయికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కేజీహెచ్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

మహారాణిపేట: కేజీహెచ్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున శనివారం పరిశీలించారు. కేజీహెచ్‌లో అత్యవసర చికిత్స విభాగంలో ఆధునికీకరణ పనులు, క్లినికల్ ల్యాబ్, ప్రధాన ద్వారం వద్ద నిర్మిస్తున్న ఆర్చ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర చికిత్స విభాగం విస్తరణ పనులను రూ.30 లక్షలతో చేపడుతున్నట్లు తెలిపారు. అదే విధంగా 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా అత్యవసర క్లినికల్ ల్యాబ్ రూ.15 లక్షలతో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాయుడు, డీఈ మన్మధరావు, ఏడీ శ్రీనివాస కుమార్, వివిధ విభాగాధిపతులు, వైద్యులు పాల్గొన్నారు.

15న చంద్రబాబు విశాఖ రాక

మహారాణిపేట: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఈనెల 15న విశాఖ వస్తున్నట్టు ఆ పార్టీ విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం టీడీపీ నగర కార్యాలయంలో సమన్వయక కమిటీ సమావేశం మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ భవిష్యత్తు రాష్ట్ర ప్రణాళికలో భాగంగా విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తారని అన్నారు. సాయంత్రం 4 గంటలకు బీచ్‌రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహం నుంచి 2 కిలోమీటర్లు బీచ్ వాక్‌లో పాల్గొంటారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ 2020 డాక్యుమెంటు ఫలాలు ఇప్పుడు అందుతున్నాయన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, నాయకులు బుద్ద నాగజగదీశ్వరరావు, అనిత, దువ్వారపు రామారావు, కోళ్ల లలిత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల భవనంపై నుంచి పడి విద్యార్థినికి తీవ్రగాయాలు



పరిశీలన చేస్తున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

సింహాచలం: కళాశాల భవనంపై నుంచి పడి విద్యార్థిని తీవ్ర గాయాలపాలైన సంఘటన శనివారం 97వ వార్డు పరిధి సుజాతనగర్‌లో చోటుచేసుకుంది. సుజాతనగర్ మెయిన్‌రోడ్డులో శ్రీ నవోదయ జూనియర్ కళాశాలలో 104 ఏరియా ప్రాంతానికి చెందిన డి.యశస్విని ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఐదంతస్తుల భవనంలో పై మూడు అంతస్తుల్లో కళాశాల నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం కళాశాలలో నిర్వహించిన పరీక్షకు యశస్విని హాజరైంది. ఈ తరుణంలోనే కళాశాల టెర్రాస్ పై నుంచి కింద పడిపోయింది. తీవ్ర గాయాలు పాలవడంతో వెంటనే యశస్వినిని కళాశాల యాజమాన్యం ఆసుపత్రికి తరలించి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆసుపత్రిలో యశస్విని చికిత్స పొందుతోంది. సమాచారం అందుకున్న నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి కళాశాల భవనానికి వచ్చి టెర్రాస్ ప్రాంతం, ఆమె కిందపడిపోయిన ప్రదేశాన్ని పరిశీలించారు. కాగా యశస్విని ప్రమాదవశాత్తూ పడిపోయిందా... ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? అన్న దానిపై ఆరా తీస్తున్నారు. కళాశాల యాజమాన్యం మీడియాకు చెబుతున్న మాటలకు, అక్కడ ఉన్న పరిస్థితులకు పొంతన లేకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. యశస్విని కళాశాలకు వచ్చినప్పుడు ఆరోగ్యం బాగాలేదని, అప్పటికే రెండు వాంతులు కూడా అయ్యాయని ప్రిన్సిపాల్ అప్పారావు మీడియాకు తెలిపారు. ఆ తర్వాత ఎలా భవనంపై నుంచి పడిపోయిందో తెలియటం లేదని చెప్పారు. కాగా శ్రీ నవోదయ కళాశాలకు పర్మిషన్ ఉందా అని మీడియా అడగటంతో పర్మిషన్ పెట్టామని పెందుర్తిలో ఉన్న తమ కళాశాలను పురుషోత్తపురానికి షిఫ్ట్ చేస్తున్నామని ప్రిన్సిపాల్ చెప్పడం గమనార్హం. కాగా రెండో శనివారం కళాశాలకు సెలవు ఇవ్వాల్సి ఉండగా పరీక్షలు పెట్టామని ప్రిన్సిపాలే చెబుతున్నారు. కాగా ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పెందుర్తి పోలీసులు చెబుతున్నారు.

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



వస్త్రాలను ప్రదర్శిస్తున్న మోడల్

బీచ్‌రోడ్డు: బీచ్‌రోడ్డులోని నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో సందర్శకులను ఆకట్టుకుంటోంది. భారతీయ సంస్కృతి సంప్రదాయలు ప్రతిబింబించే విధంగా రూపొందించిన వస్త్రాల కొనుగోలుకు యువత ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నెల 16వ తేదీ వరకు సాగే ఈ ఎక్స్‌పోలో దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన చేనేత వస్త్రాలను ప్రదర్శించారు. డిజైన్ చీరలు, దుపట్టాలు, సల్వార్ మెటీరియల్, భాగల్పూర్ సిల్క్ వస్త్రాలు, కచ్ ఎంబ్రాయిడరీ తదితర ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఎక్స్‌పో సందర్శకులకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.